ప్రార్థన.

By

K. VEERESA LINGAM

18

ప్రార్థన. 5-4-1886

ఓ భ్రాతృవరులారా!

మా ప్రార్థనసమాజముయొక్క సాంవత్సరికోత్సవమును జూచుటకయి యీ సాయంకాలము మీరంద ఱిక్కడకు వచ్చియున్నారు. మా సమాజముయొక్క యుద్దేశమేమో దాని పేరునుబట్టియే మీరు గ్రహింపవచ్చును. కాఁబట్టి మా సమాజముయొక్క ముఖ్యోద్దేశమయిన ప్రార్థననుగురించి నేఁడు కొంచెము చెప్పవలసియున్నది. అవయవార్థమునుబట్టి చూడఁగా ప్రార్థన యనుటకు వేఁడుకొనుటయే యర్థమయినను, మీరిక్కడ ప్రార్థన యనఁగా పరమేశ్వరోపాసనమని గ్రహింపవలయును. ప్రపంచారంభము మొదలుకొని నేఁటివఱకును సమస్తదేశములలోను సమస్తజాతులవారిలోను తాము స్వతంత్రులము కామనియు పుణ్యపాపపరిశీలనముచేసి తమ్ము పాలించెడు ప్రభువొకఁడు పయినున్నాఁడనియు జ్ఞాన ముండి యుండుటచేత నేదో యొకవిధమయిన మతము తప్పక కలిగి యున్నది. ఈశ్వరారాధనములేని మత మెక్కడను లేదు గనుక, భగవత్ప్రార్థన సర్వమతములలోను సర్వజనసామాన్యమయి యున్నది. వీనినిబట్టి విచారింపఁగా మనుష్యకోటియొక్క సుఖసంతోషాదులకు ప్రార్థన యత్యంతావశ్యకమనియు ముఖ్యాధారమనియు స్పష్టమగుచున్నది.

ఈశ్వరోపాసనమునకు పూజ, కృతజ్ఞత, ప్రార్థన, ముఖ్యాంగములని చెప్పవచ్చును. నేనిక్కఁడ జెప్పెడు పూజ కేవల మానసికమే కాని పుష్పపత్రాదులతోఁ జేయు బాహ్యపూజ యెంతమాత్రమును గాదు. పూజ యనఁగా సర్వేశ్వరుని సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదుల కద్భుత

ప్రమోదములు పొందుచు, సర్వకారుణ్య పరిశుద్ధత్వాదు లయిన యనంతకల్యాణగుణములను తలఁచి భక్తివిశ్వాసములతో స్తుతించి వందనములు చేయుట. కృతజ్ఞత యనఁగా సర్వదా మన సుఖసంతోషాదుల నిమిత్తమయి ఈశ్వరుఁడు దయచేసియున్న లెక్కలేని సాధనములను దెలిసికొని యాతఁడు చేసిన మహోపకారమును మఱవక యాతనియం దత్యంతప్రేమను కనఁబఱుచుట. ప్రార్థన యనఁగా భగవదాజ్ఞను మీఱి మనము చేసిన యపచారములకయి మనస్తాపము నొంది వానిని క్షమించుటకును, ఆత్మోజ్జీవమునకయి కావలసిన శాంతిపారిశుద్ధ్యాదులను దయచేయుటకును, దుర్మార్గమున కాకర్షించు ప్రబలతరములయిన కామక్రోధాదులవాతఁ బడకుండ సన్మార్గమున సంచరించు శక్తి నిచ్చుటకును, పరమేశ్వరుని హృదయపూర్వకముగా వేఁడుకొనుట. భగవదారాధనమున కిప్పుడు చెప్పిన వన్నియు నావశ్యకములే. యయినను సమయానుగుణముగా నొకప్పు డొకయంగము హెచ్చయి మఱియొకప్పుడు మఱియొక యంగము హెచ్చుకావచ్చును. మన కాకస్మికముగా గొప్పమేలు లభించినప్పుడు ప్రేమయు కృతజ్ఞతయు ప్రజ్వరిల్లి స్తోత్రవందనములు హెచ్చుకావచ్చును; మన మేదయిన సత్కార్యమున నుపక్రమించిన సమయములందు ఘోరకష్టములన్నిప్రక్కలను వచ్చి చుట్టుకొని లోకులు మనల నాపద పెట్టఁగడఁగినప్పుడు మనశక్తి చాలక యీశ్వరసాహాయ్యము నిమిత్తమయి ప్రార్థన హెచ్చుకావచ్చును. ఈశ్వరారాధనము పరులు చూచి మెచ్చుటకయి చేసెడు బాహ్యవేషధారణమును, తంత్రమును గాక, కాలస్థితిని బట్టి సమయోచితప్రయోజనసిద్ధికయి హృదయపూర్వకముగాఁ జేసెడి యుపాసన గనుక, ఆ కాలమున కేది హెచ్చుగా నుండవలెనో తదనుగుణముగా నే జరపవలెను. మన యిండ్లకడ ప్రతిదినమును

ప్రత్యేకముగాఁ జేసికొనెడు పరమేశ్వరారాధన మిప్పుడు చెప్పిన ప్రకారముగా నుండవలసినను, పలువురొక్కచోటఁ గూడి యీ ప్రకారముగా చేసెడు సమాజప్రార్థనమాత్రము సామాన్యముగా పయియంగములన్నిఁటితోడను బిండి యుండవలెను. ఇహపరలోకసుఖములకయి యీశ్వరప్రార్థన మత్యావశ్యక మని యించుమించుగా నెల్లవారు నొప్పుకొనుచున్నను, భగవత్ప్రార్థనవలనఁ బ్రయోజనము లేదని భావించువారుకూడ కొంద ఱీకాలమున నందందుఁ గానఁబడుచున్నారు. శరీరసుఖమునకయి కావలసిన యితరపదార్థములవలెనే యాత్మసుఖము నిమిత్తమయి ప్రార్థన యావశ్యక మని యెఱిఁగి యెల్లవారు నాచరించుచున్నప్పుడు, అట్టి సర్వజనానుభవసిద్ధమయిన సత్యమును స్థాపించుటకయి యుక్తులు చెప్పవలసినపనిలేదు. గాని యీ సంశయాళుర లాభము నిమిత్తమయి కొంచెము చెప్పవలసి యున్నది.

మనుష్యుఁడు తన సుఖమునకుఁ గావలసిన పదార్థముల నిమిత్తమయి పరాత్పరుని సాహాయ్య మపేక్షించువాఁడు గనుక ప్రార్థన యావశ్యక మయినది. కాఁబట్టి ప్రార్థన చేయుట మనుష్యకోటికి సహజగుణము. ఆఁకలి వేసినప్పుడు బిడ్డ పాలనిమిత్తమయి తల్లిని వేఁడుకొనును; అన్నాతురుఁడైన దరిద్రుఁడు తన కన్నము పెట్టగల ధనికుని గృహమునకుఁ బోయి వేఁడుకొనును; రోగార్తుఁడు వ్యాధిబాధ తొలఁగింపఁగల వైద్యుని యొద్దకుఁ బోయి వేఁడుకొనును. ఈ ప్రకారముగా బాలురు మొదలుకొని వృద్ధులవఱకును తమ పోషణము నిమిత్తమును సంరక్షణము నిమిత్తమును విపన్నివారణము నిమిత్తమును తత్తత్కార్యములను చేయఁగలవారిని చేరి ప్రార్థింతురు. పోషణరక్షణాదులు లేక శరీర మెట్లు సుఖస్థితియం దుండనేరదో యట్లే యాత్మయు పోషణరక్షణాదులు లేక సుఖస్థితియం దుండఁజాలదు. దేహ

సంబంధములయిన లోపములు తటస్థించి నప్పుడు తల్లోపములను వారింపఁ గలవారిని వెదకుచుఁ బోయి ప్రార్థించులాగుననే మనుష్యుఁ డాత్మసంబంధములయిన లోపములు సంభవించినప్పు డా లోపము లను దీర్చి సుఖము ప్రసాదింపఁ గలిగిన యీశ్వరుని నిజస్వభావము చేతనే ప్రార్థించును. జ్ఞానశరీరపోషణమున కావశ్యకములయిన సత్యశాంత్యాదులకు లోపము తటస్థించి నప్పుడు తత్సంపాదనమున కయి గుణసంపత్ప్రదాతయైన యీశ్వరునే వేఁడుకోవలెను; పాప రోగముల బాధచేత నాత్మరక్షణము కావలసి వచ్చినప్పుడు భవరోగ వైద్యుఁ డయిన యీశ్వరునే వేఁడుకొనవలెను; అనివార్యము లయిన యింద్రియముల యుద్రేకముచేత చిత్తదౌర్బల్యము కలిగి సుఖాభా వము సంప్రాప్తము కాఁబోవు నప్పుడు సుఖసంధాయకుఁ డయిన యీశ్వరునే వేఁడుకొనవలెను. ఈ చెప్పిన దృష్టాంతముల వలన భగ వత్ప్రార్థన యావశ్యక మనియు స్వాభావికమనియు నేర్పడుచున్నది. సమస్తమునకును మన కెవ్వ డాధారభూతుఁడుగ నున్నాఁడో, ఎవ్వని యనుగ్రహము లేక మన మొక్క నిముషమయిన సుఖపడుటకు శక్తులము కామో, ఎవ్వడు ప్రతిదినమును మన మనుభవించు నట్టియు మనకు ప్రియమయి నట్టియు మన మనుగడను సుఖవంత ముగాఁ జేయునట్టియు సమస్తపదార్థములను సాధనములను దయ చేసెనో, అట్టి పరమదయాళుఁడును పరిశుద్ధుఁడును ప్రేమైకనిధియు నైన యా యీశ్వరుని సంపూర్ణభక్తితోను కృతజ్ఞతతోను దినమున కొకసారి రెండు నిమిషము లయినను స్మరింపక, ప్రార్థింపక, తెలి సిన వాఁ డెవ్వఁ డూరకుండఁగలుగును?

అప్రయత్నముగా కాలోచితమైన ప్రార్థన స్వభావముచేతనే కలుగునని యేర్పడినను, అట్టి ప్రార్థనవలననే ఫలము గలుగదనియు,

అర్ధనిమీలిత నేత్రములతో నాకాశమువంకఁ జూచుచు చేతులు జోడించి ఈశ్వరనామము లోలోపల గొణిగినంతమాత్రముచేత నీశ్వరుఁడు ముక్తినియ్యఁడనియు, ఈ బాహ్యాచరణము లేమియు లేకపోయినను భూతదయ గలిగి కామక్రోధాదులకు లోఁబడక శాంతత వహించి బీదలను సాధులను గాపాడుచు నిత్యసత్యవ్రతమును పూని పరోపకారదీక్ష వహించి పాపముల పొంతఁ బోవక న్యాయముగా ప్రవర్తించు వారిని ధర్మస్వరూపుఁడయిన యీశ్వరుఁడు శాశ్వత సుఖమునుండి తొలగింపఁడనియు, ఈశ్వరాజ్ఞారూప మయిన సత్ప్రవర్తనము ముక్తికి సాధనము కాని యీశ్వరుని ముఖస్తుతులు చేయుట కాదనియు, కొందఱు బుద్ధిమంతులు చెప్పుదురు. యుక్త ప్రవర్తనము లేని భగవన్నామసంస్మరణము పుణ్యమునకు హేతువు కాకపోయినను, భగవద్భక్తి లేనిదే సంపూర్ణమయిన సన్మార్గవర్తన మెప్పటికిని లభింపనేరదు. నీతివర్తనమునందు భగవంతుని ప్రాపు నమ్ముకొనక స్వశక్తినే నమ్ముకొనువారికి నానాముఖముల కష్టములును విఘ్నములును సంప్రాప్తములయి దుష్టుల వలనను పామరుల వలనను బాధలు సంభవించి రాజోపద్రవము కలిగినప్పుడు చలింపక నిలిచి ధర్మమార్గమును వదలకుండుటకు ధైర్యమెక్కడనుండి వచ్చును? ఒకవేళ లేని ధైర్యమును కొంతకాలము తెచ్చుకొన్నను మనస్సుఖమును నుత్సాహము నెట్లు కలుగును? కాఁబట్టి సమస్తవిషయముల యందును భగవంతుని ప్రాపునే నమ్ముకొని భగవత్ప్రార్థనము చేయుచు సమస్తమును భగవత్ప్రీతి కొఱకే చేయనివాఁడు సదా సంపూర్ణనీతిమంతుఁ డయి యుండనేరఁడు. ఆపదలు రాకున్నంత వఱకు మాత్రము నీతిమార్గమున నడచిన నడువవచ్చును. ఇఁక సమస్తమునకును భగవంతుని ప్రాపునే నమ్ముకొని యీశ్వరప్రార్థన

మునే విషువకుండెడివాఁడో నిరంతర ధ్యానము వలన భగవత్సాన్నిధ్యమును పొంది యానందపరవశుఁడయి తన్నావఱి కాశ్రయించియున్న దుఃఖములను, కష్టములను, దుశ్చింతలను మఱచి, ఆత్మపారిశుద్ధ్యమును పొంది, ఏ కార్యమునందును తన సహజ దౌర్బల్యమును గానక యెక్కుడలేని, యుత్సాహమును ధైర్యమును సాహసమును కనఁబఱిచి, కష్టజాలములయందు సహిత మపరిమిత సుఖసంతోషములను పొందును. ప్రభువుల కెల్లను ప్రభువయిన యా సర్వశక్తుని యాశ్రయబలముచేత లోకములోని యే ప్రతిబంధకమును విఘ్నమును లక్ష్యపెట్టక సత్కార్యాచరణమునందు నిర్భయముగా ప్రవర్తించును. కాఁబట్టి యీశ్వరప్రార్థన వలననే సమస్తగుణములును కలుగును; ఈశ్వరప్రార్థన వలన దుర్బలులకు బలమువచ్చును; ఈశ్వరప్రార్థన వలన భీరులు ధీరులగుదురు; ఈశ్వరప్రార్థన వలన నిరాశులయిన వారి కాశ గలుగును; ఈశ్వరప్రార్థన వలన మూఢులు వివేకు లగుదురు; ఈశ్వరప్రార్థన వలన దుష్టులు సద్వర్తను లగుదురు. అదిగాక దుర్భరములయిన కష్టములు వచ్చి బాధించు నప్పుడు వానిని తొలఁగించుకొనుటకును, ఇంద్రియము లుద్రేకించి హృదయమును బలవంతముగా పాపకార్యముల కీడ్చు నప్పుడు తప్పించుకొనుటకును, కేవల మనుష్యశక్తి చాలదు. ప్రార్థనమూలమున నమూల్యమయిన యీశ్వరసాహాయ్యము నావశ్యకముగా పొందవలెను. దైవసాహాయ్యమును పొందుటకు భక్తిపూర్వకమయిన ప్రార్థన తప్ప సాధనాంతరము లేదు. భగవత్సామీప్య సాన్నిధ్యములను గలిగించుకొని, మన కష్టసుఖములను విన్నవించుకొని అభయప్రదానమును బలమును పొంది, ఆత్మశాంతిని పొందుటకు ప్రార్థన యొక్కటియే యమోఘమార్గము. మనము చిత్తశుద్ధితో ప్రార్థించినయెడల, ప్రార్థననుండి

లేవఁగానే యాత్మోజ్జీవనముగలిగి మనకు క్రొత్తబలమును ధైర్యమును సంతోషమును పరిశుద్ధతయు కలుగును. మనుష్యుఁ డీ లోకములో పొందఁదగిన యుత్కృష్టానందమంతయు మన కొకట ప్రార్థనమూలము ననే లభించును. సత్ప్రవర్తనము లేనిపక్షమున కేవల బాహ్యమైన పర మేశ్వరప్రార్థనవలన ఫలమేమియు లేదని నాకును దృఢమైన నమ్మిక మున్నది. నడత మంచిదికాక భగవంతునిగుఱించి యూరక నోటితో చెప్పుమాటలు గాలి కెగిరిపోవును. అట్టి ప్రార్థనలు కీచుపిట్టలును యంత్రములునుచేయు ధ్వనులకంటె నధికప్రయోజనకరము లయినవి కావు. హృదయపూర్వకముగాచేయని బాహ్యపూజలవలన వృథా యాసమేకాని ఫలలేశ మయినను కలుగదు. కాని మనఃపూర్తిగా చేయుప్రార్థనలుమాత్ర మెప్పుడును నిష్ఫలములు కానేరవు. భక్తి పూర్వకములయిన యట్టి ప్రార్థన లాలించి యీశ్వరుఁడు తగిన ఫలము నియ్యక మానఁడు. నిష్కపటమయిన ప్రార్థనయును దుష్టచింతయు నొక్కమనస్సులో చిరకాల మేకముగా నుండనేరవు. ఆ రెంటిలో నేదో యొక్కటిమాత్రమే మనస్సునందు కాపురము చేయును. చేసెడు ప్రార్థన హృదయపూర్వకమయినదే యయిన పక్షమున దుశ్చింత మన స్సులో నిలువలేక క్రమక్రమముగా క్షీణించి పాఱిపోవలెను. ప్రార్థన హృదయపూర్వక మయినది కానప్పుడుమాత్రమే దుష్టవర్తనము మన స్సును విడిచిపెట్టకుండును. కాఁబట్టి పైకి సభలలో ప్రార్థనలు చేయువాఁ డెవ్వడయిన క్రమక్రమముగా తన చెడునడతను విడువకుండెడుపక్షమున, అట్టివాఁడు నిజమయిన భక్తుఁడు కాడనియు, వాని యారాధనము కపటనాటకమే కాని త్రికరణశుద్ధియయిన యుపాసనకాదనియు, వాఁడు పామరులను స్వార్థపరుఁడయి భ్రమింపఁజేయు పరమవంచకుఁ డనియు మీరు సులభముగా తెలిసికోవచ్చును. మనము హృదయ

పూర్వకముగాజేసెడు ప్రార్థనలు మన మేపాపముచేత పీడింపఁబడుచుండుమో యా పాపనివారణార్థమును, మన మేప్రయోజనమును గోరియుండుమో దాని లాభమునిమిత్తమును అయియుండవలెను గాని సామాన్యముగా "మమ్ము పాపములనుండి విముక్తులను జేయుము" "మ మ్మాపదలనుండి తొలఁగింపుము" "మాకు సద్గుణములను ప్రసాదింపుము" అని మాత్రము ప్రార్థించుటవలన నంతగా ప్రయోజనముండదు. మన మసత్యము పలికిన యెడల నసత్యమునుండి కాపాడుమనియే వేఁడుకోవలెను; చౌర్యము చేసినయెడల ముందు చోరత్వమునందు బుద్ధి తగులకుండునట్లు చేయువలయు ననియే ప్రార్థింపవలెను. కామమును మరల్చుకోలేకపోయిన పక్షమున కామనివారణసామర్థ్యమును దయచేయవలయు ననియే ప్రార్థింపవలయును. అసత్య మాడుటచేత హృదయతాపము నొందుచు ముం దసత్యము జిహ్వాగ్రమునకు రాకుండఁ జేయవలయు నని హృదయపూర్వకముగా ప్రార్థించువాఁడసత్యమునుండి మరలకుండునా? దొంగతనము చేయుటచేత మనోవేదన పొందుచు ముందు పరులసొత్తుమీఁదికి తన మనస్సును పోకుండఁ జేయవలెనని మనసార ప్రార్థించువాఁడు మరల దొంగతనము చేయుటకు చేయి చాపఁగలుగునా? వ్యభిచారదుఃఖముచేత మనస్తాపము నొందుచు తన మనస్సు పరాంగనలమీఁదికి పోకుండఁ జేయుమని నిష్కపటముగా ప్రార్థించువాఁడు మరల పరకాంత పొందాసింపఁగలఁడా? కాఁబట్టి యెప్పుడును లేనిపోని కోరికలు కోరక మనయందేలోపము కనఁబడునో దాని నిమిత్తమే వేఁడుకొనవలయును.

మనము కోరెడు కోరికలనెల్ల నిచ్చుటకు భగవంతుఁడు చంచలుఁడు కాఁడనియు, తన శాసనములను మన ప్రార్థనలనుబట్టి నడుమ నడుమ మార్చుచుండునా యనియు, కొంద ఱాక్షేపింతురు. భగవంతుఁ

డెంతమాత్రమును చంచలుఁడు కాఁడు; ఒక్కరి నిమిత్తమయి తాను చేసిన శాసనములను మార్చువాఁడును, కాఁడు. మనము వేసవికాలములో వాన లిమ్మని ప్రార్థించినను శీతకాలములో వేఁడిమి నిమ్మని ప్రార్థించినను ధనమునుగాని స్త్రీలనుగాని సంపదలనుగాని కీర్తినిగాని యితరభోగములనుగాని యిమ్మని ప్రార్థించినను, మనము కోరినందుచేత నిచ్చువాఁడు కాఁడు. అట్టివి వచ్చుటవలన మనకు సుఖమును కలుగక పోవచ్చును. అట్టి యిహలోకసంపదలు సంప్రాప్త మయినప్పుడు మనము సంపన్నాంధులమయి యీశ్వరుని మఱచి తుచ్ఛసుఖముల నిమిత్తమయి దుశ్చేష్టల మరగి కడపట పరలోకహానియుఁ దెచ్చుకోవచ్చును. కాఁబట్టి యట్టి నష్టకరములయిన కోరికల నతఁ డెప్పుడును ఫలింపఁజేయఁడు. మన మాతనిని కోరవలసిన కోరికలు మనస్సులను పాపకార్యములనుండి మరలింపవలసిన దనియు, సత్కార్యములయం దాసక్తములయి యుండునట్లు చేయవలసిన దనియు, భగవదాజ్ఞలను చెల్లించుటకయి ధైర్యసాహసములను సుఖశాంత్యాదులను నను గ్రహింపవలసిన దనియు, ఈ మొదలైన యాముష్మికసంబంధములైనవయి యుండవలెను. అప్పు డవి యీశ్వరుఁడు మనకు తప్పక ప్రసాదించును. అట్లు చేయుటవలన భగవచ్ఛాసనము మాఱవలసిన పని లేదు. అట్టి విషయములలో హృదయపూర్వకముగా తన్ను ప్రార్థించువారి కవి లభించి యాత్మశాంతి, పారిశుద్ధ్యము మొదలయినవి కలుగవలె ననియే భగవంతుని శాసనము. ఒక్కజ్యోతినుండి మనము దూరముగా పోయినకొలఁదిని వెలుతు రంతకంతకు తగ్గుచు వచ్చి యా జ్యోతిని సమీపించుకొలఁదిని వెలుతురు హెచ్చుచు వచ్చులాగుననే జ్ఞానజ్యోతియైన యీశ్వరుని ప్రార్థనల మూలమున మనము సమీపించిన కొలఁదిని పాపాంధకారము దూరముగా తొలఁగుచుండునట్లును,

భక్తిహీనతమూలమున నీశ్వరునికి దూరముగా తొలఁగు కొలఁదిని పాపాంధకారము మనల చుట్టుకొని కన్ను కానకుండుట తటస్థించు నట్లును, ఈశ్వరుఁడు మొట్టమొదటనే శాసించి యున్నాఁడు.

మన కేమికావలయునో యీశ్వరునికి తెలియనే తెలియును గదా, మరల ప్రార్థింపవలసిన పని యేమున్న దని కొంద రాక్షేపణ చేయుదురు. భగవంతుఁడు - మన కోరికలను ప్రసాదించుట పరిశుద్ధ చింతతో మన మడిగినందుకుఁ గాని మనకు లోపములున్నందు నిమిత్తమయికాదు. కపటము లేకుండ మన మనోగతములను తెలుపుట చేతకూడ దుఃఖశాంతియు సుఖాతిశయమును కలుగవలెనని గూడ భగవంతుని శాసనములలో నొకశాసనముగా నున్నది. అందుచేతనే మనకు దుఃఖము కలిగినప్పుడు ప్రేమాస్పదులయిన మిత్రులతోఁ జెప్పుటచేత సగము దుఃఖము తీఱును; మనకు శుభము కలిగినప్పుడు వారితోఁ జెప్పుటచేత మన సంతోషము ద్విగుణ మగును. కాఁబట్టి మనకుఁ గావలసినవాని నన్నిఁటిని భగవంతుఁడు తెలిసినవాఁడే యయినను మన దుఃఖశాంతినిమిత్తమును సంతోషాభివృద్ధి నిమిత్తమును మన ప్రార్థన లత్యావశ్యకములు. అదిగాక మన మొకవిషయమయి ప్రార్థించుచు సదా దానిని తలఁచుకొనుచుండెడి పక్షమున దాని విషయమై మనము మఱింత జాగరూకులమై యుందుము; కాఁబట్టి బొత్తిగా ప్రార్థనచేయని వానికంటె ప్రార్థనలు చేయు భక్తిహీనుఁడును కొంత యధికలాభము పొందును.

లోకములో భగవదారాధనము మూఁడువిధములుగా నుండును. అందొకటి యెవరి యింటివద్ద వారు రహస్యముగా చేయు ప్రత్యేకప్రార్థన. దాని విషయమయి ఈవఱకు కొంత చెప్పియున్నాను. రెండవది భార్యలు పుత్రులు సోదరులు మొదలయిన వారందఱును

జేరి గృహమునఁ జేయు కుటుంబ ప్రార్థన. ఈ ప్రార్థనవలన కుటుంబములోని వారికెల్ల నైకమత్యమును నెమ్మదియు, బిడ్డలకు పెద్దలయందు భక్తియు, నమ్రతయు, పరోపకారచింతయు మొదలయిన బహుసుగుణములబ్బును. సంసారదుఃఖములు కానరాక సుఖముకలుగును. మూడవది యిటువంటి సమాజప్రార్థన మనుష్యుడు సమస్తవిషయములలోను పరస్పరసాహాయ్యమువలననే సుఖపడుననుట యెల్లవారు నెఱిగిన విషయమే. ఆలాగుననే యీశ్వరారాధన విషయమునఁ గూడ సంఘీభవించి చేసిన ప్రార్థనవలన సమస్తలాభములును కలుగును. ఐకమత్యముపుట్టును. ఈప్రకారముగా సమాజప్రార్థనలు లేని జాతులవారంతకంతకు మూఢులై క్రూరవర్తనులై నాగరికుల దూషణకు పాత్రులై నీతిమాలినవా రగుదురు.

ఈశ్వరారాధనమువలన పైని చెప్పినవిగాక ముఖ్యముగా కలిగెడు మఱియొక లాభము పరమేశ్వరుని తఱుచుగా స్మరించుచుండుటచేత నాతనియందును తద్గుణములయందును ప్రీతియును గౌరవమును కలిగి మన మాయన గుణముల నవలంబించుటకు ప్రయత్నించి బాగుపడుట. కాఁబట్టి యెల్లవారును నే నిప్పుడు చెప్పిన మూఁడువిధముల ప్రార్థనలును మన దేశమున వర్థిల్లునట్లు చేయుదురుగాక !